గోరింటాకు మురిపెం..

- అందం.. ఆరోగ్యం
- ఆషాఢంలో మహిళల ఆసక్తి
- ఇంటింటా అతివల గోరింటాకు సందడి



గోరింటాకు పెట్టుకున్నాక.. ఎర్రగా పండిన చేతులు



గోరింటాకు కోస్తున్న మహిళలు

సండే స్పెషల్

సత్తుపల్లిటౌన్/తల్లాడ: ఆషాఢ మాసం వచ్చిందంటే.. గుర్తుకొచ్చేది గోరింటాకే. ఈ ఆషాఢ మాసంలో మహిళలు ఎంతో ఇష్టంగా గోరింటాకును అలంకరించుకోవడం సాంప్రదాయం. యువతులు, మహిళలు, పిల్లల చేతులకు పెట్టుకున్న గోరింటాకుతో కళకళలాడుతుంటారు. రుతువు మారినవేళ గోరింటాకు పెట్టుకుంటే కాళ్లు, చేతులు, గోళ్లు శుభ్రపడతాయని.. రోగ నిరోధకంగా ఉంటూ వ్యాధులను దూరం చేస్తుందని నమ్మకం.

ఒకప్పుడు గోరింటాకు ముద్దలుగా చేసి ఇంటిల్లిపాది చేతులు, కాళ్లకు పెట్టుకునేవారు. పట్టణ ప్రాంతాల్లో మెహందీగా వివిధ ఆకృతుల్లో తీర్చిదిద్దటానికి కొంతమంది ఉపాధి పొందుతున్నారు.

తయారీ ఇలా..

ఈ నెల ఆరంభం నుంచే మహిళలు గోరింటాకు కోసం సేకరించటంలో నిమగ్నమయ్యారు. సహజ సిద్ధంగా లభించే గోరింటాకులను తెచ్చి.. కొంచెం చింతపండు, పెరుగు, నిమ్మకాయ మిశ్రమంతో ముద్దగా తయారు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలోని పల్లెలతో పాటు పట్టణాల్లో ఏ ఇంట చూసినా అతివల గోరింటాకు సందడి కనిపిస్తోంది. కొందరు తమ చేతులపై రకరకాల డిజైన్లతో అలంకరణ చేసుకుంటున్నారు.

శుభం.. సౌభాగ్యం..

గోరింటాకు మహిళల చేతులు, కాళ్లకు అందాన్ని చేకూరిస్తుందని.. ఎర్రగా పండితే యువతులకు మంచి భర్త వస్తాడని విశ్వసిస్తారు. ఇది శుభానికి చిహ్నంగా భావిస్తారు. ఆషాఢ మాసంలో కొత్త పెళ్లి కూతుళ్లు పుట్టింటికి చేరుకోవడం తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయం. ఆ సమయంలో చేతులకు గోరింటాకు పెట్టుకుంటారు. అది వారికి సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుంది.

ప్రయోజనాలెన్నో..

గోరింటాకు ఒక ఆరోగ్య సంజీవనిగా ఆయుర్వేద వైద్యం గుర్తించింది. అంటు రోగాలను నివారించటంలో సహాయపడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. రక్త ప్రసరణ మెరుగు పరుస్తుంది. శరీరంలో వేడిని సమతుల్యం చేస్తుంది. చర్మ వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

గోరింటాకు అంటే ఇష్టం..



గోరింటాకు అంటే బాగా ఇష్టం. గోరింటాకు పెట్టుకోవడం వల్ల అందంతో పాటు ఐశ్వర్యం, ఆరోగ్యం చేకూరుతుంది. అందుకే ప్రతి ఏటా ఆషాఢ మాసంలో తప్పని సరిగా గోరింటాకు పెట్టుకుంటాం. మాకు ఈ కాలంలో గోరింటాకు అందుబాటులో ఉంటుంది కనుక వారానికొకసారి పెట్టుకుంటూనే ఉంటాం.

– గాజుల రూపాదేవి, అన్నారుగూడెం

సౌభాగ్యానికి సంకేతంగా..



ఆషాఢంలో గోరింటాకుపెట్టుకోవడం సౌభాగ్యానికి, శ్రేయస్సుకు సంకేతంగా భావిస్తాం. చిన్నప్పటి నుంచి చేతులకు గోరింటాకు అలంకరించుకోవటం అంటే చాలా ఇష్టం. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న గోరింటాకును ఆషాడమాసంలో పెట్టుకొని ఎర్రగా పండితే మురిసి పోతాం. ఇది మనసంస్కృతి సాంప్రదాయం.

– పి.వసుంధర, సత్తుపల్లి

ఆరోగ్యానికి మేలు..



గోరింటాకు ఒంట్లో వేడిని తగ్గించి శరీరాన్ని చల్లబరచడానికి సహాయపడడంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అంటురోగాలు దరి చేరవు. గోళ్ల పెళుసు బారి పోకుండా గోరుచుట్టు వ్యాధులు రాకుండా ఉంటాయి. జ్వరం, తలనొప్పిని తగ్గిరచడమే కారుండా జుట్టును రాలకుండా సంరక్షిస్తుంది.

– డాక్టర్ పి.వసుమతీదేవి, ప్రభుత్వ వైద్యురాలు, సత్తుపల్లి

దశల వారీగా సమస్యల పరిష్కారం

- పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో వైరా మున్సిపల్ కమిషనర్ వేణు

సాక్షి ఫోన్ ఇన్



వైరా: మున్సిపాలిటీ పరిధిలో సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ చింతల వేణు వెల్లడించారు. కొన్నింటికి ఆర్థిక అనుమతులు అవసరమైనందున ఆలస్యమైనా తప్పక పరిష్కారం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకురావొచ్చని పేర్కొన్నారు. ఈమేరకు ప్రజల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లేలా 'సాక్షి'ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన 'ఫోన్ ఇన్'కు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా తాగునీరు, డ్రెయిన్లు, సీసీ రోడ్లతో పాటుగా పారిశుద్ధ్య సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు.

ప్రశ్న : 8వ వార్డులో డ్రెయినేజీలు శుభ్రం చేయక దుర్వాసన వస్తోంది. – చిలక చిన్నకోటయ్య

కమిషనర్ : హైవే వెంట ఒక అపార్ట్‌మెంట్ నుంచి వ్యర్థాలు రోడ్లపైకి వస్తున్నాయి. ఇక్కడ డ్రెయిన్ నిర్మాణానికి టెండర్లు పిలిచాం.

ప్రశ్న : 1వ వార్డు బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్డు వెంటే చెత్త వేస్తున్నారు. దీంతో దోమలు పెరుగుతున్నాయి. – డేవిడ్ రాజు

కమిషనర్ : రోడ్ల వెంట చెత్త వేయకుండా పర్యవేక్షిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేపడతాం.

ప్రశ్న : 7వ వార్డు బాహ్మణపల్లిలో బొడ్రాయి వద్ద రహదారికి పగుళ్లు వచ్చాయి. సీసీ రోడ్డు వేసేఅవకాశముందా? – పూర్ణకంటి రామారావు

కమిషనర్ : రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదిస్తాం. అక్కడ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: 9వ వార్డు గురుకుల పాఠశాలలో వాడిన మురుగు నీరు రోడ్డుపైకి వస్తుండడం ఇబ్బందిగా ఉంది.

– కిట్టుబాబు /ప్రశాంత్

కమిషనర్ : వ్యర్థాలు రోడ్లపైకి రాకుండా డ్రెయిన్ తీయిస్తాం. జేసీబీ ద్వారా పనులు చేపడుతాం.

ప్రశ్న: 4వ వార్డు ఎన్నెస్పీ కాలనీ సమీపాన చెట్లు, ముళ్లపొదలు పెరిగాయి. జెడ్పీఎస్ఎస్ నుండి నీరు రోడ్డుపైకి వస్తోంది.

– బొర్రా సర్వేశ్వరరావు

కమిషనర్ : ముళ్ల పొదలు, చెత్త తొలగింపునకు సిబ్బందిని పంపిస్తాం. త్వరలో డ్రెయన్ నిర్మాణం కూడా చేపడతాం.

ప్రశ్న: 12వ వార్డులోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.

– చలపతిరావు

కమిషనర్ : చెత్త తొలగించేలా ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇస్తాం. దోమల నివారణకు ఫాంగింగ్ చేయిస్తాం.

ప్రశ్న: 8వ వార్డు బోడేపూడి కాలనీలో డ్రెయినేజీ నిర్మించినా చివరివరకు మురుగు వెళ్లడం లేదు. ఇళ్లలో వాడిన నీరు ఎక్కడికక్కడే నిలిచి దుర్వాసన వస్తోంది.

– వసంతరాజు

కమిషనర్ : రోడ్లపై మురుగు నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. తక్షణమే బ్లీచింగ్, ఫాగింగ్ చేయిస్తాం.

ప్రశ్న : 12వ వార్డు సబ్‌ట్రెజరీ కార్యాలయం వద్ద వీధి లైట్లు వెలగడం లేదు. స్తంభాలు విరిగిపోయాయి.

– వీరభద్రం

కమిషనర్ : వీధిలైట్ల ఏర్పాటుకు సిబ్బందిని పంపిస్తాం. విరిగిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటుకు విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేస్తాం.

ప్రశ్న: 15వ వార్డు దిద్దిపూడి శివారులో తాగునీటి సమస్య ఉంది. వారంలో ఒక్కరోజు కూడా నీరు రావడం లేదు.

– అప్పారావు

కమిషనర్ : తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం. పైపులైన్లలో అవసరమైన మరమ్మతులు చేయిస్తాం.

ప్రశ్న: 8వ వార్డులో మూడు రోజులకోసారి తాగునీరు వస్తోంది. డ్రెయిన్లలో చెత్త పేరుకుపోయింది.

– నంద్రూ పద్మారావు, రాంబాబు

కమిషనర్ : తాగునీటి సమస్య లేకుండా చూస్తాం. స్పెషల్ డ్రైవ్ ద్వారా పారిశుద్ధ్య సమస్య పరిష్కరిస్తాం.

ప్రశ్న: 5వ వార్డు సాయిబాబా ఆలయ ప్రాంతంలోని డ్రెయిన్లలో చెత్త పేరుకుపోయి దోమలు పెరుగుతున్నాయి. కాలనీవాసులు జ్వరాల బారిన పడుతున్నారు.

– జాలాది రామకృష్ణ

కమిషనర్ : దోమల నివారణకు ఫాగింగ్ చేస్తాం. తక్షణమే డ్రెయిన్లు శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న: 19వ వార్డు లాలాపురం యాదవ బజారులో సైడ్ డ్రెయిన్ లేక నీరు రోడ్డుపైకి చేరి దెబ్బతింటోంది.

– సాయిబాబు

కమిషనర్ : జేసీబీతో తాత్కాలికంగా డ్రెయిన్లు ఏర్పాటుచేసి నీరు వెళ్లేలా చూస్తాం.

ప్రశ్న: 9వ వార్డు లీలాసుందరయ్యనగర్‌లో పిచ్చి మొక్కలు పెరిగి పాములకు నిలయంగా మారింది.

– వీణాకుమారి

కమిషనర్ : రోడ్ల వెంట చెత్తను తొలగిస్తాం. డ్రెయిన్లు శుభ్రపరుస్తాం.

ప్రశ్న: 20వ వార్డు శాంతినగర్‌లోని ఖాళీ ప్లాట్లలో నీరు చేరి దోమల వృద్ధికి కారణమవుతోంది.

– ఎం.సురేష్

కమిషనర్ : జేసీబీ సాయంతో పిచ్చి మొక్కలు తొలగించి ఫాగింగ్ చేపడతాం.

ప్రశ్న: 5వ వార్డు ఠాగూర్ పాఠశాల సమీపానికి మురుగు నీరు చేరుతోంది. దోమలు పెరగడంతో పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. డ్రెయిన్లు కూడా శుభ్రం చేయించండి.

– రజిని, ప్రసాద్, శ్రీనివాసరావు, శైలజ, రాము, కిరణ్, జగదీష్

కమిషనర్ : నీరు నిలిచిన ప్రాంతంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తాం. డ్రెయిన్లలో నీరు నిలవకుండా చెత్త తీయిస్తాం.

తక్షణ స్పందన

'సాక్షి'ఫోన్‌లో అందిన సమస్యల పరిష్కారంపై కమిషనర్ చింతల వేణు తక్షణమే స్పందించారు. ఫోన్ ఇన్ ముగియగానే అప్పటికప్పుడు పరిష్కారమయ్యే సమస్యలను గుర్తించి సిబ్బందిని పంపించారు. ఇందులో భాగంగా 5వ వార్డ్‌కు జేసీబీని పంపించి డ్రెయినేజీలో పేరుకు పోయిన సిల్ట్‌ను తీయించగా, రాజశేఖర్‌నగర్ ప్రాంతంలో ఏళ్ల తరబడి పెరిగిన పిచ్చిమొక్కలు, డ్రెయిన్లను సైతం శుభ్రం చేయించారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు 'సాక్షి'తో పాటు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



జేసీబీతో డ్రెయినేజీలో సిల్ట్ తీయిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

కారేపల్లి: కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ)లో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా, 20-20-0-13, డీఏపీ అందుబాటులో ఉన్నాయని, యూరియా కోసం రైతులు ఎవరు ఇబ్బందులు పడొద్దని, అవసరాలకు తగినంతనే యూరియాను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. బీపీటీ-5204 రకం వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆధార్ కార్డుతో నేరుగా సొసైటీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు నంబర్ 917723 36912 సంప్రదించాలని తెలిపారు.

ఈదమ్మతల్లి వేడుకలు

సత్తుపల్లిరూరల్: కాకర్లపల్లి రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యాన శనివారం ఈదమ్మ తల్లి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి మేకలతో మొక్కులు చెల్లించుకున్నారు. రజక సంఘం బాధ్యులు ప్రసాద్, నరేష్, చెన్నారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జ్‌ను కలిసిన ఆర్యవైశ్యులు



వంశీ చంద్‌రెడ్డితో వైరా పట్టణ ఆర్యవైశ్యులు

వైరా: కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమితుడైన కల్వకుర్తి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి ఖమ్మం వచ్చిన సందర్భంగా.. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటుగా వైరా పట్టణ ఆర్యవైశ్యులు శనివారం కలిశారు. వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆర్యవైశ్యలకు ఇవ్వాలని వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నాగి, శ్రీనివాస్, భాస్కర్, ప్రవీణ్, రవికుమార్, రాము, కృష్ణారావు, రాజా, నరేష్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



బీజేపీలో చేరిన వారికి కండువా కప్పి అభినందిస్తున్న కోటేశ్వరరావు

కొణిజర్ల: మండలంలోని పలు గ్రామలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన వారు శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు సమక్షంలో బీజేపీలో చేరారు. శనివారం కొణిజర్లలో స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల కార్యకర్తలు బీజేపీలో చేరగా కోటేశ్వరరావు వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



గుడిపాడులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, నాయకులు

సత్తుపల్లిటౌన్: ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పరిష్కారం చూపుతూ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శనివారం పట్టణంలోని 1వ వార్డు గుడిపాడు కాలనీలో మున్సిపల్ అధికారులతో కలిసి ఆమె మార్నింగ్ వాక్ చేస్తూ ప్రజలను సమస్యలను అడిగి పరిష్కరించారు. బీఆర్ఎస్ హయాంలో శంకుస్థాపనలకు పరిమితమైతమైన పనులు ఇప్పుడు పరుగులు పెడుతున్నాయన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి సరఫరా ట్రాక్టర్లను ప్రారంభించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో 16, 21వ వార్డుల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో మట్టా దయానంద్, ఆనంద్, మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా, ఏఈ సురేష్, సుజలరాణి, నర్సింహారావు, కమల్‌పాషా, చెన్నారావు, కృష్ణయ్య, సందీప్‌గౌడ్, సారథి, ప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత



లబ్ధిదారురాలికి మంజూరు పత్రం అందిస్తున్న ఏఎంసీ చైర్మన్ నర్సింహారావు

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేని ఇళ్ల మంజూరును కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేశారన్నారు. ఇండ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ నరేంద్రరెడ్డి, తదితరులున్నారు.

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

మధిర: గ్రామ సభలు నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధిర బోడెపూడి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎంతమంది దివ్యాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, ఇల్లు లేని పేదలకు, రేకుల షెడ్డు ఉన్నవారికి ఇల్లు కేటాయించారో గ్రామసభ పెట్టి చెప్పగలరా అని ప్రశ్నించారు. అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, లేనిఎడల పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు శీలం నరసింహారావు, మందా సైదులు, పడకంటి మురళి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కారేపల్లి: మండల పరిధిలోని సీతారాంపురంలో సీతారాంపురం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి శనివారం ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుండమల్ల కార్తీక్‌కుమార్, మర్సకట్ల నాగేశ్వరరావు, కొలికపొంగు సాయి, జోగ వెంకటేష్, జోగ సాయి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

కొణిజర్ల: మండలంలోని తీగలబంజర వద్ద ఉన్న పగిడేరుపై హైలెవల్ వంతెన నిర్మించాలని కోరుతూ.. తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దొండపాటి రమేష్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు.. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లకు వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన వారు.. ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కు అందిస్తున్న వెంకటేశ్వర్లు

చింతకాని: మండలంలోని చింతకాని, జగన్నాథపురం గ్రామాల్లో లబ్ధిదారులకు శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న చింతకాని గ్రామానికి చెందిన తన్నీరు జ్యోతి, దంతాల పద్మ, గుత్తికొండ శ్యామ్, జగన్నాథపురం గ్రామానికి చెందిన తన్నీరు పుల్లారావు లకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.1.32 లక్షల విలువైన చెక్కులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, గోపి, నాగార్జున్, గోవిందరావు, ప్రగతి, అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

బోనకల్: రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, సీపీఐ సహాయ మండల కార్యదర్శి జక్కుల రామారావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఈ నెల 9న అకస్మాత్తుగా గుండెకు సంబంధించిన సమస్య తలెత్తడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయనకు స్టంట్లు వేశారు. శనివారం ఆయన నివాసమైన గోవిందాపురం(ఎల్) గ్రామంలో సీపీఐ జాతీయసమితి సభ్యుడు భాగం హేమంతరావు, రాష్ట్రసమితి సభ్యుడు జితేందర్‌రెడ్డి, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి గోవిందరావు, రాష్ట్ర మహిళా సభ్యురాలు కళావతి, రజకసంఘం జిల్లా అధ్యక్షులు బ్రహ్మయ్య తదితరులు పరామర్శించారు.

వైరా మున్సిపాలిటీలో వన మహోత్సవం

వైరా: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ చింతా వేణు ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో సిబ్బంది ఇంటింటికీ తిరిగి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వేణు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో 50 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీర్ వెంకట్రావు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు తరలిన ఆర్టీసీ బస్సులు



బస్సులను ప్రారంభిస్తున్న అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి శనివారం రెండు డీలక్స్ బస్సుల్లో అంతర్వేది, వాడపల్లి పుణ్యక్షేత్రాల దర్శనానికి భక్తులు తరలి వెళ్లారు. ఈ బస్సులను సత్తుపల్లి ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వీబీఓ కిన్నెర ఆనంద్, సూపర్‌వైజర్లు జాకబ్, చిన్నప్పరెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి'కి కేంద్రం తూట్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

వైరా: పోరాటాలతో సాధించుకున్న ఉపాధి హామీ చట్టానికి కేంద్రప్రభుత్వం తూట్లు పొడుస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం వైరాలో కొండబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏటేటా ఉపాధిహామీకి నిధులు కేటాయింపు తగ్గిస్తూ దేశవ్యాప్తంగా 8కోట్ల మంది నిరుపేదలకు ఉపాధిపనులను దూరం చేసిందన్నారు. ఉపాధి చట్టాల పరిరక్షణకు రైతులు, వ్యవసాయ కూలీలు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరభద్రం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కృష్ణ, సుధాకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌తో అప్రమత్తంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లి: వంట గ్యాస్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి శ్రీహనుమాన్ దత్తసాయి ఇండేన్ గ్యాస్ నిర్వాహకుడు గుండు శశాంక్ ఉమామహేశ్వరరావు అన్నారు. సత్తుపల్లిలో శనివారం మహిళలు, విద్యార్థులకు వంట గ్యాస్ వినియోగం, ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వంట చేసేటప్పుడు కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలని, రెగ్యులేటర్‌ను వంట అయిన వెంటనే ఆఫ్ చేయాలని సూచించారు. గ్యాస్ సిలిండర్‌ను ఎల్లప్పుడు నిటారుగా ఉంచాలని, గ్యాస్ స్టౌవ్ సిలిండర్ కన్నా ఎత్తులో చదునైనా ప్రదేశంలో ఉంచాలని వివరించారు. గ్యాస్ వినియోగించే సమయంలో ఏదైనా అనుమానం వస్తే 1902కు ఫోన్ చేసి ప్రమాదాన్ని నివారించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నివారణపై పరీక్ష నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, ఐటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న అధ్యాపకుడు కొండలరావు

మధిర: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మధిర టౌన్ పోలీస్‌స్టేషన్ అడిషనల్ ఎస్ఐ ఎం.కిషోర్ కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల కంప్యూటర్ అధ్యాపకుడు కొండలరావు తెలిపారు. శనివారం మధిర పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులు మంచి మార్గాలను ఏ విధంగా ఎంపిక చేసుకోవాలో అవగాహన కల్పించారు. డ్రగ్స్ వంటి చెడు వ్యసనాల జోలికి వెళ్లకూడదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం తరఫున నూరుశాతం ఫలితాల కోసం కష్టపడతామని కొండలరావు తెలిపారు. హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చదువుతోపాటు ఆటల పోటీల్లో కూడా ప్రతిభను చాటి అన్ని రంగాల్లో ప్రావీణ్యత సాధించాలని కోరారు.

పేదలకోసం పోరాడేది ఎర్రజెండాయే..

సత్తుపల్లిరూరల్: పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వర్లు, దండు ఆదినారాయణ తెలిపారు. శనివారం గంగారంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో దారా భీమయ్య, మహాదేవ లక్ష్మి, కొరస వెంకటమ్మ అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ సత్తుపల్లిరూరల్ మండల మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యోబు, పట్టణ కార్యదర్శి రామకృష్ణ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సుధాకర్, సుధాకర్, వీరయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

పెనుబల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని లంకపల్లి సుందరయ్య కాలనీలో నిర్వహించిన తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం నాల్గొవ మండల మహా సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గాయం తిరుపతిరావు, కార్యదర్శిగా చిమట విశ్వనాథం, కమిటీ సభ్యులు తడికమళ్ల చిరంజీవి, రాజినేని మంగమ్మ, సవలం విజయ్‌కుమారి, కుంజా రాములు, ఆదినారాయణ, జొన్నలగడ్డ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మేకల కాపరి మృతి

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లకు చెందిన మేకలి కాపరి పండగ సీతారాములు(55) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. ఆయన ఉదయం మేకలను మేతకు తీసుకుని పొలానికి వెళ్లాడు. అక్కడే గుండెపోటు రావడంతో మృతి చెందాడు. సీతారాములకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఆర్థిక సాయం

చింతకాని: మండలంలోని చిన్నమండవ గ్రామంలో ఇటీవల మున్నేరు నీటిలో మునిగి మృతి చెందిన అన్నదమ్ములు కాశిమాల నాగగోపి, నందకిషోర్ కుటుంబసభ్యులకు గ్రామానికి చెందిన ఎస్సీ కులస్తులు శనివారం రాత్రి రూ.15,500 నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు మున్నేరు నీటిలో మునిగి చేతికొచ్చిన ఇద్దరు కుమారులను కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎస్సీ కులపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

శవపేటిక అందజేత..

ఏన్కూరు: మండలంలోని తిమ్మారావుపేట గ్రామంలో ఇటీవల మృతి చెదిన ఉగ్గం నాగేంద్రమ్మ జ్ఞాపకార్థం ఆమె కూతుళ్లు, అల్లుళ్లు కన్నెబోయిన వెంకటేశ్వర్లు, విజయకుమారి, దొంతెబోయిన కృష్ణారావు, సింధూ రూ.80వేల విలువ చేసే ఆఖరినిద్ర శవపేటికను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని అభినందించారు.